సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




శనివారం 04 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 306 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## లోక్‌సభ నియోజకవర్గాల పెంపు బిల్లు ఈ నెలలోనే – దేశవ్యాప్తంగా ఉత్కంఠ

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 4, ప్రతినిధి: దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఈ నెలలోనే పార్లమెంటు ముందుకు రానున్నట్లు సమాచారం. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రెండు రోజుల ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. 2026 తర్వాతే నియోజకవర్గాల పెంపు అమల్లోకి రావాలనే గత రాజ్యాంగ సవరణ గడువు సమీపించడంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. బిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్య గణనీయంగా పెరిగి 750 నుంచి 848 వరకు చేరవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నియోజకవర్గాల పెంపునకు సుమారు యాభై శాతం పెంపు ప్రాతిపదికగా తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యత ప్రధాన అంశంగా మారింది. జనాభా నియంత్రణలో ముందున్న తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు తమ ప్రాతినిధ్యం తగ్గుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తుండగా, జనాభా అధికంగా పెరిగిన ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు సీట్లు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ అమలుకు కూడా నియోజకవర్గాల పునర్విభజన అవసరమవడంతో కేంద్రం ఈ ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకుంది. కొత్త పార్లమెంటు భవనంలో పెరిగే సభ్యుల సంఖ్యకు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు ఇప్పటికే సిద్ధం చేయడం ఈ బిల్లు త్వరలోనే రానున్నదనే సంకేతాలను ఇస్తోంది. రాజకీయంగా ఇది కీలక పరిణామంగా మారుతుందని, ప్రాంతీయ పార్టీల ప్రభావం, కేంద్రంలో అధికార సమీకరణాలు ఈ మార్పులతో ప్రభావితమయ్యే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్ష పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని ఇప్పటికే డిమాండ్ చేస్తున్నాయి. ఈ నెలలో జరగబోయే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



## జన్ విశ్వాస్ బిల్ 2026 – పాలనలో భారీ సంస్కరణలకు నాంది

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 4, ప్రతినిధి: దేశంలో పాలనా విధానంలో కీలక మార్పులకు దారితీసే జన్ విశ్వాస్ బిల్ 2026కు కేంద్ర ప్రభుత్వం రూపుదిద్దుతోంది. విశ్వాసం, సరళీకరణ, ఫలితాల ఆధారిత సంస్కరణలపై దృష్టి సారించిన ఈ బిల్లు ద్వారా పౌరులకు సౌలభ్యం కల్పించడంతో పాటు వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు ద్వారా 79 కేంద్ర చట్టాలలోని 784 నిబంధనలను సవరించడంతో పాటు వెయ్యికి పైగా నేరాలను పునర్వ్యవస్థీకరించనున్నారు. ముఖ్యంగా 717 చిన్నపాటి నేరాలను డీక్రిమినలైజ్ చేసి జైలు శిక్షల స్థానంలో సివిల్ పెనాల్టీలను అమలు చేయడం ద్వారా ప్రజలపై ఉన్న చట్టపరమైన భారం తగ్గించనున్నారు. అలాగే ఈజ్ ఆఫ్ లివింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మెరుగుపరిచేందుకు 67 లక్ష్యిత మార్పులు చేయనున్నట్లు సమాచారం. పాత, అవసరం లేని చట్టాలను తొలగించడం ద్వారా వేధింపులు, అనవసర కేసులు తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు అడ్జుడికేటింగ్ అధికారులను నియమించే అవకాశం కూడా కల్పించబడనుంది. ఈ సంస్కరణలతో న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తగ్గడంతో పాటు వ్యాపార రంగంలో విశ్వాసం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద జన్ విశ్వాస్ బిల్ 2026 దేశాన్ని అధిక క్రిమినలైజేషన్ నుంచి దూరం చేసి ఆధునిక, విశ్వాసపూరిత పాలనా వ్యవస్థ వైపు తీసుకెళ్లే చారిత్రాత్మక సంస్కరణగా భావిస్తున్నారు.



## పాడి పరిశ్రమ అభివృద్ధి: సీఎం ఎ. రేవంత్ రెడ్డి జూబ్లీ హిల్స్ నివాసంలో ముఖ్య సమావేశం


సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకోవడానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి జూబ్లీ హిల్స్ నివాసంలో జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు చైర్మన్ డాక్టర్ మీనేష్ షా గారు, మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయతీర్థ చారి గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రధాన అంశాలపై చర్చ జరిగింది.
సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గారు, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి గారు, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి గారు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణను ముందుగా అభివృద్ధి చేసుకోండి: కేరళ సీఎం పినరయి విజయన్ కౌంటర్



సందేశం టైమ్స్, తిరువనంతపురం, ఏప్రిల్ 4, ప్రతినిధి: కేరళ పర్యటన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఘాటుగా స్పందించారు. తెలంగాణలో పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తూ, కేరళ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని ఆయన అన్నారు. కేరళలో కేవలం 0.55 శాతం మాత్రమే పేదరికం ఉండడం దేశంలోనే అత్యల్పమని పేర్కొన్నారు. రాజకీయ ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసే బదులు ఆ నిధులను తెలంగాణ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. 2025లో తెలంగాణ అధికారులు కేరళకు వచ్చి డిజిటల్ ల్యాండ్ రికార్డ్ వ్యవస్థను అధ్యయనం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, జీతాలు, పెన్షన్లు ఆలస్యంగా చెల్లించే ప్రభుత్వం కేరళకు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదని విమర్శించారు. సంక్షేమం, సమర్థవంతమైన పాలన గురించి తెలుసుకోవాలంటే కేరళకు రావాలని ఆయన ఆహ్వానించారు. ఈ వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి.

## ఆర్టిమిస్ 2 నుంచి భూమి ఫోటో – వ్యోమగాములు చూపించిన ప్రకృతి వైభవం



సందేశం టైమ్స్, ఏప్రిల్ 04: అమెరికా వ్యోమ సంస్థ HACA ఆర్టిమిస్ 2 అంతరిక్ష నౌకలో ప్రయాణిస్తున్న వ్యోమగాములు భూమిని అహర్నిశా సమీపం నుంచి చూశారు. వ్యోమగాములు తీసిన ఫోటోల్లో, భూమి నీలిరంగు సముద్రాలు, వెండి తీరాలు, పచ్చికతో నిండిన కప్పిన భూభాగాలు మరియు మేఘాల కాంతివిభవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వీటి గురించి వ్యోమగాములు మాట్లాడుతూ, “భూమి అంతరిక్షం నుండి చూసినప్పుడు మరింత అందంగా, శాంతిగా, అలాగే భూమిపై మన బాధ్యతను గుర్తుచేసేలా ఉంది. ప్రతి కోణంలో ప్రకృతి వైభవం, జీవ వైవిధ్యం మనం రక్షించుకోవాల్సిన అతి ముఖ్యమైన ఆస్తి” అని అన్నారు.అత్యంత నూతన కెమెరా సాంకేతికతతో తీసిన ఈ ఫోటోలు భూమి యొక్క సౌందర్యాన్ని మరియు మనం తీసుకునే పరిసరాల పరిరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు గుర్తు చేస్తాయి. HACA ప్రకటించిన వివరాల ప్రకారం, ఆర్టిమిస్ 2 ప్రయాణం భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలకు దారి చూపుతూ, భూమి మరియు అంతరిక్ష పరిస్థితులపై పరిశీలనలు కొనసాగిస్తోంది.ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారినాయి. నిపుణులు, పాఠశాలలు, పరిశోధకులు భూమి యొక్క అందం, ప్రకృతి వైభవం, మరియు మానవ జాగ్రత్తల అవసరాన్ని ఈ ఫోటోలు స్పష్టంగా తెలియజేస్తాయని పేర్కొన్నారు.

## తెలంగాణలో టీడీపీ–బీజేపీ–జనసేన పొత్తు? రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రతినిధి: తెలంగాణలో రాబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల మధ్య పొత్తు చర్చలు జరుగుతున్నాయన్న వార్తలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమిగా పోటీ చేయాలన్న ఆలోచనపై తెలంగాణ బీజేపీ నేతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇటీవలి రాజ్యసభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిపై తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రశంసలు కురిపించడం కూడా ఈ రాజకీయ సమీకరణాలకు బలం చేకూర్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు మున్సిపల్ ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మద్దతు కోసం బీజేపీ నేతలు రామచందర్ రావు, కిషన్ రెడ్డి సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అయితే కొన్ని ప్రాంతాల్లో ఆంధ్ర ఓటర్ల ప్రభావం తక్కువగా ఉండటంతో చివరి నిమిషంలో జనసేనతో పొత్తు వెనక్కి తీసుకున్న సందర్భాలు ఉన్నట్లు చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఆంధ్ర సెటిలర్ ఓట్లను ఆకర్షించేందుకు టీడీపీతో పొత్తుకు తెలంగాణ బీజేపీ ఆసక్తి చూపుతోందని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి. మేయర్ పదవి సాధించాలంటే టీడీపీ, జనసేన మద్దతు కీలకమని బీజేపీ సీనియర్ నేతలు భావిస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద తెలంగాణలో ఈ మూడు పార్టీల పొత్తు అంశం రాబోయే ఎన్నికల రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మరణంలోనూ ముగ్గురికి ప్రాణదానం చేసిన పోలీస్ సిబ్బంది




సందేశం టైమ్స్, అంబర్‌పేట, ఏప్రిల్ 4, ప్రతినిధి: అంబర్‌పేట పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కంబాల శంకర్ రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ కావడం తీవ్ర విషాదానికి దారి తీసింది. అయితే ఈ దుఃఖ సమయంలోనూ ఆయన తండ్రి గొప్ప మనసుతో శంకర్ అవయవాలను దానం చేయాలని నిర్ణయించడంతో రెండు కిడ్నీలు, ఒక లివర్‌ను అవసరమైన వారికి మార్పిడి చేసి ముగ్గురు ప్రాణాలను కాపాడగలిగారు. ఈ సంఘటన మానవత్వానికి ప్రతీకగా నిలుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచింది.




## వేసవి సెలవుల షెడ్యూల్ ఖరారు – విద్యార్థులకు ఊరట

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రతినిధి: రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షలు చివరి దశకు చేరుకోవడంతో వేసవి సెలవులపై నెలకొన్న అనిశ్చితికి ప్రభుత్వం తెరదించింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగింపు దశలో కొనసాగుతుండగా, ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకనం వేగంగా జరుగుతోంది. అధికారుల ప్రకారం ఈ నెల మూడో వారంలో ఇంటర్ ఫలితాలను విడుదల చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే సమయంలో రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత, ఉష్ణోగ్రతలు గణనీయంగా అధికమవుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు అమల్లో ఉంటాయని వెల్లడించింది. సెలవుల అనంతరం జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపింది. కాగా ఈ నిర్ణయం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో సంతోషాన్ని కలిగించగా, తీవ్రమైన ఎండల సమయంలో పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని విద్యా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 4, ప్రతినిధి: దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంఘ నాయకులు యాదగిరి తదితరులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా చరిత్రలో నిలిచారని తెలిపారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, సమానత్వం కోసం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని చెప్పారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయులను కుల, వర్గ పరిమితుల్లో కాకుండా వారి ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీర్షేభ చర్చ్ ఆఫ్ గాడ్‌లో ఘనంగా గుడ్ ఫ్రైడే ఆరాధనలు



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 4, ప్రతినిధి: పటాన్చెరు పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీ ఆర్‌కే వన్ కాలనీలో ఉన్న బీర్షేభ చర్చ్ ఆఫ్ గాడ్‌లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ఆరాధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. పాస్టర్ ఎం.ఆర్.జి ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపవాస ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా యేసు ప్రభువు శిలువపై మరణం వెనుక ఉన్న ఆధ్యాత్మిక సందేశాన్ని విశదీకరించారు. ప్రజల పాప విమోచన కోసం యేసు చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ విశ్వాసులు ప్రార్థనలు చేశారు. అలాగే రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్ర నాయకులు, ముఖ్యమంత్రి, దేశ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ప్రపంచంలో నెలకొన్న యుద్ధ వాతావరణం సద్దుమణిగి శాంతి చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం కావాలని దేవుని కృప కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.



# ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలో మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, ధైర్యం, ధర్మం, స్వాతంత్ర్యానికి ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ జీవిత గాథ ప్రతి భారతీయునికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 1630 ఫిబ్రవరి 19న జన్మించిన శివాజీ మహారాజ్ 1680 ఏప్రిల్ 3న పరమపదించిన విషయం గుర్తుచేస్తూ, విదేశీ ఆక్రమణలకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజల రక్షణ కోసం న్యాయపాలనను స్థాపించిన మహానేతగా ఆయన నిలిచారని తెలిపారు. గెరిల్లా యుద్ధ విధానంలో అపూర్వ నైపుణ్యం సంపాదించిన శివాజీ మహారాజ్ హిందూ సంస్కృతి పరిరక్షణలో విశేష పాత్ర పోషించారని, ఆయన చూపిన ధైర్యం, నిజాయితీ, దేశభక్తి మార్గంలో నడవడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత పాల్గొని మహారాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా స్మరించుకున్నారు.

# గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు సువర్ణావకాశం



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 4, ప్రతినిధి: గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ అధికారి నీలిమ తెలిపారు. ఈ కార్యక్రమం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సమన్వయంతో కేరళ రాష్ట్రంలోని కోచి నగరంలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో మే 2026లో ప్రారంభమయ్యే తదుపరి బ్యాచ్ కోసం నిర్వహించబడనుంది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన గిరిజన యువతకు మొత్తం 25 సీట్లు కేటాయించగా, మెదక్ జిల్లాకు చెందిన అర్హత గల నిరుద్యోగ అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తి చేసి ఏప్రిల్ 10, 2026లోపు సమర్పించాలని ఆమె సూచించారు. ఈ శిక్షణలో ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ (ఆయిల్ & గ్యాస్), ఇండస్ట్రియల్ వెల్డర్, ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, టెక్నీషియన్ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి కోర్సులు అందుబాటులో ఉండగా, కోర్సు వ్యవధి ఆరు నెలలు రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుంది. టెక్నికల్ డిప్లొమా పూర్తి చేసినవారు లేదా ఫైనల్ ఇయర్ విద్యార్థులు, ఐటీఐ ఉత్తీర్ణులు అర్హులు కాగా, వయస్సు పరిమితి 25 సంవత్సరాలు (ఎస్.టి అభ్యర్థులకు 2 సంవత్సరాల సడలింపు)గా నిర్ణయించారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం, లెర్నింగ్ మెటీరియల్స్, యూనిఫాం, సేఫ్టీ షూస్ వంటి సౌకర్యాలు కల్పించబడతాయి. శిక్షణ అనంతరం నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ద్వారా సర్టిఫికేట్ ప్రదానం చేయడంతో పాటు ప్లేస్‌మెంట్ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. గిరిజన యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని నీలిమ పిలుపునిచ్చారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఏప్రిల్ 10, 2026గా నిర్ణయించగా, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# సూర్యాపేట జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు రేపు

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 4, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా స్థాయి సీనియర్ పురుషులు, మహిళలు మరియు 20 సంవత్సరాల లోపు బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఏప్రిల్ 5న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పోటీలు పట్టణంలోని ఓల్డ్ ఎస్పీ ఆఫీస్, ఇందిరమ్మ కాలనీలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పురుషులు, మహిళలు మరియు అండర్-20 విభాగాల్లో అన్ని ఈవెంట్లలో పోటీలు నిర్వహించబడతాయని వెల్లడించారు. జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఏప్రిల్ 11 మరియు 12 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా తమ జనన ధృవీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. అండర్-20 విభాగానికి 26-04-2006 నుండి 27-04-2010 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారికి ప్రవేశ రుసుము రూ.300గా నిర్ణయించగా, మరిన్ని వివరాలకు అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చెరుకు వెంకటేష్‌ను సంప్రదించాలని తెలిపారు.

## కంగ్రిలో శ్రీ సిద్ధేశ్వర ఉత్సవమూర్తి శోభాయాత్ర ఘనంగా నిర్వహణ



సందేశం టైమ్స్, కంగ్రి, ఏప్రిల్ 4, ప్రతినిధి: కంగ్రి గ్రామంలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి మఠం నుండి స్వామివారి ఉత్సవమూర్తి శోభాయాత్ర శుక్రవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. అనాదిగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం మఠంలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. శోభాయాత్ర దారి పొడవున ప్రతి ఇంట మహిళలు మంగళహారతులు పట్టుకొని స్వామివారికి ఘన స్వాగతం పలికారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

## కబడ్డీ కోచ్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 4, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కోదాడలోని కెఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా కబడ్డీ సెంటర్‌లో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు అర్హత కలిగిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి తెలిపారు. జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న అనుభవం కలిగిన కబడ్డీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు వివిధ స్థాయిలలో సాధించిన మెడల్స్, సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను జతచేసి ఏప్రిల్ 10, 2026లోపు జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం, సూర్యాపేటలో సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9100949979 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## న్యాయపీఠంపై చిలకలూరిపేట యమున



సందేశం టైమ్స్, చిలకలూరిపేట, ఏప్రిల్ 4, ప్రతినిధి: పట్టుదల ఉంటే ఆకాశమే హద్దు అని నిరూపిస్తూ చిలకలూరిపేట పట్టణానికి చెందిన యువ న్యాయవాది సాతులూరి యమున సివిల్ జడ్జిగా ఎంపికై పట్టణానికి గౌరవాన్ని తీసుకువచ్చారు. ప్రముఖ న్యాయవాది సాతులూరి భాగ్యరావు కుమార్తె అయిన యమున చిన్నప్పటి నుంచే తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని న్యాయవృత్తిలో అడుగుపెట్టారు. కేఎల్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన అనంతరం తన తండ్రి వద్దే జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ న్యాయశాస్త్రంలోని మెళకువలను క్రమంగా అభ్యసించారు. మొదటి ప్రయత్నంలో విజయం సాధించలేకపోయినా అధైర్యపడకుండా, తండ్రి ప్రోత్సాహంతో తన లోపాలను సరిదిద్దుకుని రెండో ప్రయత్నంలో పట్టుదలతో పరీక్ష రాసి సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. కుమార్తె సాధించిన ఈ విజయంపై తండ్రి భాగ్యరావు ఆనందం వ్యక్తం చేస్తూ ఆమె కష్టానికి తగిన ఫలితం దక్కిందని భావోద్వేగానికి లోనయ్యారు. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన యమున కఠోర శ్రమతో ఈ స్థాయికి చేరుకోవడం పట్ల చిలకలూరిపేట వాసులు హర్షం వ్యక్తం చేస్తుండగా, పట్టణ ప్రముఖులు, తోటి న్యాయవాదులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యమున విజయం ఈ తరం యువతకు, ముఖ్యంగా విద్యార్థినులకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.



## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 4, ప్రతినిధి: చింతకాని మండల కేంద్రంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆర్‌సిఎం చర్చ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఫాదర్ శౌరి సారథ్యంలో గ్రామ పురవీధుల్లో సిలువ ప్రదర్శన నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యేసు క్రీస్తు శిలువ వేయబడిన సమయంలో అనుభవించిన శ్రమలను స్మరించుకుంటూ భక్తులు స్వయంగా సిలువ మోస్తూ ప్రార్థనలు చేశారు. భారీగా నిర్వహించిన ఈ ప్రదర్శన గ్రామ ప్రధాన వీధుల గుండా సాగి చివరికి చర్చ్ ప్రాంగణానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో చింతకాని పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.

## ఘనంగా తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 4, ప్రతినిధి: స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జయంతిని సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభు గౌడ్, ప్రధాన కార్యదర్శి పార్వతి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల మల్లికార్జున్ పటేల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1927లో జన్మించిన దొడ్డి కొమురయ్య తన 19వ ఏటే భూస్వాముల అరాచకాలపై పోరాడుతూ ప్రాణత్యాగం చేసి తొలి అమరుడిగా నిలిచారని, ఆయన త్యాగం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జిల్లా కలెక్టర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జగదీశ్వర్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత, హైదరాబాద్ మాజీ కార్పొరేటర్ పుష్పా నగేష్, రాష్ట్ర బీసీ సంఘం నాయకులు, జిల్లా నాయకులు పాండు, పాజీ అనంత, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులు





సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 4, ప్రతినిధి: దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి వీరమరణం పొందిన యోధుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని, ఆయన ధైర్యం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. రాజకీయ, సామాజిక రంగాలలో అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన ఆశయాలు నేటికీ ప్రాసంగికంగా ఉన్నాయని, రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొంది సమాజంలో న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు. బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహులు మాట్లాడుతూ జనగాం జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామంలో సాధారణ గొర్రెల కాపరి కుటుంబంలో జన్మించిన దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిన మహానుభావుడని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన ఉద్యమానికి ఆయన అమరత్వమే ప్రేరణగా నిలిచిందన్నారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ శంకర్, నాయకులు జి. సత్యనారాయణ, డాక్టర్ రామ్మూర్తి, చిన్న శ్రీరాములు, వి. సత్యనారాయణ, హుస్సేన్, రాజయ్య, లింగయ్య, పి. గామయ్య తదితరులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం మంత్రి దామోదర రాజనర్సింహ

### దొడ్డి కొమురయ్య ఆశయాలు సమాజానికి దారిదీపం – కలెక్టర్ ప్రావీణ్య





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 4, ప్రతినిధి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాత్ర కీలకమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా శుక్రవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపల్లిలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతుల హక్కుల కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన ధైర్యసాహసాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ ఉద్యమానికి నాంది పలికిన అమరవీరుడిగా దొడ్డి కొమురయ్యను కొనియాడుతూ యువత ఆయన జీవితం నుంచి ప్రేరణ పొందాలని సూచించారు. సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్లు కూన వనిత, సుమలత శ్రీకాంత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీశ్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం మల్లయ్య, జనరల్ సెక్రటరీ తాటిపల్లి పాండు, బీసీ సంఘం యూత్ అధ్యక్షుడు రమేష్ కుమార్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పటాన్చెరు ఇంద్రేశం మున్సిపాలిటీ కొత్త హై మాస్ట్ లైట్లు ఏర్పాటు



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 4, ప్రతినిధి: పటాన్చెరు మండల్ ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని ఐనోల్ గ్రామంలోని గురువారం మార్కెట్ ప్రాంతంలో కొత్తగా హై మాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ పనిని హర్షవర్ధన్ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న యువ నాయకుడు హర్షారెడ్డి మాట్లాడుతూ, ఈ లైట్ల వల్ల రాత్రి సమయంలో మార్కెట్ ప్రాంతానికి వెలుతురు పెరుగుతూ భద్రత మెరుగుపడుతుందని అన్నారు.

## దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ఆత్మగౌరవ పోరాటం కొనసాగిస్తాం KGKS ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 4, ప్రతినిధి: తెలంగాణ సాయుధ రైతాంగ యోధుడు దొడ్డి కొమరయ్య 99వ జయంతి సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం మరియు కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు. రమేష్ గౌడ్ మాట్లాడుతూ, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమరయ్య ముందంజలో నిలబడి ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పోరాడిన తొలి అమరుడు అని తెలిపారు. ఆయన త్యాగంతోనే వేల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేయడం సాధ్యమైందని గుర్తు చేశారు. నేటికీ సమాజంలో కొన్ని ప్రదేశాల్లో భూములు లేని సమస్య ఇంకా ఉందని, దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో రాబోయే రోజుల్లో సామాజిక న్యాయం కోసం, రైతులను సమీకరించి పెద్ద ఎత్తున భూ పోరాటం చేస్తామని చెప్పారు.

# కంగ్టి మండలంలో దొంగతనం కేసు ఛేదన నిందితురాలు అరెస్ట్




సందేశం టైమ్స్, కంగ్టి, ఏప్రిల్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. నిందితురాలు వాడిత్య సౌందర్య (వయసు 21), జమ్గి బీ తండా నివాసిని గుర్తించి అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాలను గుర్తించి విచారణ జరిపినందున ఆమె తన నేరాన్ని ఒప్పుకుంది. గతంలో సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కేసులో జైలుకు వెళ్ళి, ఇటీవలే బెయిల్‌పై విడుదలైన ఆమె, డబ్బుల అవసరం కారణంగా మళ్లీ దోపిడీకి పాల్పడినట్లు వెల్లడైంది.ఏప్రిల్ 1న యంపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలో యాసం సంతోష్ ఇంటి తాళం పగులగొట్టి, బంగారం, నగదు దోచుకెళ్లిన నిందితురాలీ వద్ద సుమారు 8 తులాలు 5 గ్రాముల బంగారం, రూ.1,10,000 నగదు, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితురాలిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపారు. పోలీసులు దొంగతనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ప్రతి ఇంటిలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

# బీడకన్యలో మందిరం కూల్చివేతపై గ్రామస్థుల ఆందోళన

## ప్రభుత్వం జాగ్రత్త చర్యలు తీసుకోవాలి





సందేశం టైమ్స్, ఝరాసంగం, ఏప్రిల్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బీడకన్య గ్రామంలోని రాచన్న స్వామి లోంక పురాతన గోపురం వద్ద నిర్మించిన ఆశ్రమం కూల్చివేత ఘటన స్థానికుల్లో తీవ్ర ఉద్రిక్తతను రేకెత్తించింది.గ్రామస్తులు తెలిపారు, నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందిన ఈ మందిరాన్ని కొందరు పార్టీ వైఖరితో అనూహ్యంగా కూల్చివేశారని వారు ఆరోపిస్తున్నారు. స్వంత నిధులతో గోపురానికి మెట్లు నిర్మించి, అభివృద్ధి పనులు చేపట్టినా ఈ చర్య అన్యాయమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికులు పేర్కొన్నారు, మాతాజీ సేవల ద్వారా ఆరోగ్య, కుటుంబ సమస్యలకు పరిష్కారం లభిస్తూ, కులమత భేదం లేకుండా అందరికీ సేవలు అందిస్తున్నారని. గౌటాన్ ప్రాంతంలోని 350 ఎకరాల భూమిలో ఉన్న మూడు పురాతన మందిరాల్లో కేవలం ఈ ఒక్కదాన్ని మాత్రమే కూల్చివేయడం వెనుక కారణాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్థులు ఈ సందర్భంలో ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, ఎంపీకి సమస్యను తెలియజేసి న్యాయం కోరతారని పేర్కొన్నారు.





# రైతు భరోసా రెండో విడత నిధుల జమ షెడ్యూల్ ఖరారు

సందేశం టైమ్స్ హైదరాబాద్, ఏప్రిల్ 4ప్రతినిధి హైదరాబాద్ తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకంలో రెండో విడత నిధుల జమపై స్పష్టత ఇచ్చింది. ఇప్పటికే తొలి విడతలో 70 లక్షల మంది రైతులకు రూ.3,590 కోట్లను మార్చి 22న జమ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు రెండో విడత నిధులను ఏప్రిల్ రెండో వారంలో రైతుల ఖాతాల్లో జమ చేయేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా ఈ విడతలో ఎకరానికి మించి భూమి ఉన్న రైతులకు, ముఖ్యంగా 5 ఎకరాల వరకు భూమి కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వనుంది. సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష అనంతరం రైతులకు ఇచ్చిన హామీ మేరకు నిధుల విడుదలను వేగవంతం చేయాలని ఆదేశించగా, ఆర్థిక శాఖ సుమారు రూ.2,650 కోట్లను సమీకరించే పనిలో నిమగ్నమైంది. ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.6 వేల చొప్పున సాయం అందించే ఈ పథకం అమలుకు దాదాపు రూ.9 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్న ప్రభుత్వం, మిగతా రైతులకు మూడో విడతలో నిధులు జమ చేసి ఈ నెలాఖరులోగా మొత్తం చెల్లింపులు పూర్తి చేయాలని నిర్ణయించింది.

# మేడికుందలో సీసీ రోడ్ ప్రారంభం – ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు ప్రారంభించారు



సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మేడికుంద గ్రామంలోని చర్చి సమీపంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు సర్పంచ్ చంద్రకళ ఆదేశాల మేరకు శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు.గ్రామ పంచాయతీ పాలకవర్గం కోరిక మేరకు పూర్తి చేసిన ఈ రోడ్డు మేడికుంద గ్రామంలోని రహదారుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాధాన్యతకై నిర్మించబడిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కాచూర్ రావు మాట్లాడుతూ, గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రతి ప్రయత్నం చేస్తానని, ఈ రోడ్డు ద్వారా స్థానికుల రాకపోకలు సులభతరం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు.గ్రామస్థులు రోడ్డు మంజూరు చేసిన మంత్రి దామోదర రాజనర్సింహకు, సహకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్స్, గ్రామ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య జయంతి – మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఘన నివాళులు



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో దొడ్డి కొమరయ్య 99వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు నాయకులు మల్గొండ, భీమన్న, నవనాథ్, లక్ష్మణ్, నర్సింలు తదితరులు పాల్గొని అతి ప్రియమైన అమరుడి సేవలను స్మరించారు.

# పెద్దపెల్లి జిల్లాలో TRP జిల్లా కార్యాలయం ఘనంగా ప్రారంభం



సందేశం టైమ్స్, పెద్దపెల్లి, ఏప్రిల్ 4: తెలంగాణ రాజ్యాధికార పార్టీ (TRP) పెద్దపెల్లి జిల్లా కార్యాలయం ఘనంగా ప్రారంభించబడింది. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ రాష్ట్ర సెక్రటరీ అఖిల్ పాషా, సోషల్ మీడియా సౌత్ తెలంగాణ కన్వీనర్ మార్త శ్రీనివాస్, నూతన జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్లతో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లాలోని పలు పార్టీ నాయకులు TRPలో అధికారికంగా చేరారు. మాధం రజిని కుమార్ యాదవ్ గారు చేరిన నాయకులందరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ, "ఎవరెంతో వారికంత అనే సిద్ధాంతంతో మా పార్టీ ముందుకు సాగుతోంది. బీసీలపై జరుగుతున్న అన్యాయాలు, అవకతవకలను ఎదుర్కొని తీన్మార్ మల్లన్న గారి నేతృత్వంలో TRP ఆవిర్భవించింది. మైనారిటీలకు నిజమైన రాజకీయ, సామాజిక న్యాయం కేవలం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ద్వారా సాధ్యమే. గ్రామస్థాయి నుంచి మండలం, జిల్లా వరకు పార్టీ నిర్మాణం బలంగా ఉండాలి. బీసీ యువత, మహిళలు, వ్యవసాయకులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేయాలి. రాబోయే రోజుల్లో పెద్దపెల్లి జిల్లా TRP బలమైన కేంద్రంగా మారాలి." అని సూచించారు.పార్టీ రాష్ట్ర సెక్రటరీ అఖిల్ పాషా గారు, "బీసీలకు నిజమైన రాజ్యాధికారం అందించే ఏకైక పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ మాత్రమే. ఎవరెంతో వారికంత అనే సిద్ధాంతంతో పార్టీ ముందుకు నడుస్తుంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా TRP నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవం మరియు పార్టీ చేరికల కార్యక్రమం ఉత్సాహవంతంగా, సంఘీభావంతో ముగిసింది.

# స్పోర్ట్స్ కోచింగ్‌లో ఆరు వారాల సర్టిఫికేట్ కోర్సు దరఖాస్తులు ఆహ్వానం




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రతినిధి శెట్టి వెంకటేష్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) పరిధిలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (NSNIS), పాటియాలా, మే–జూన్ 2026 విద్యా సెషన్‌కు సంబంధించి స్పోర్ట్స్ కోచింగ్‌లో ఆరు వారాల సర్టిఫికేట్ కోర్సు నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు లేదా క్రీడా సంస్థల్లో పనిచేస్తున్న పురుషులు, మహిళలు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఏప్రిల్ 1, 2026న ప్రారంభమై, ఏప్రిల్ 22 వరకు కొనసాగుతాయి. అభ్యర్థులు కనీసం 10+2 ఉత్తీర్ణత, సంబంధిత క్రీడలో జిల్లా, అంతర్ కళాశాల లేదా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న అనుభవం కలిగి ఉండాలి. వయసు 20–42 సంవత్సరాల మధ్య ఉండాలి; ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మరియు ఈశాన్య రాష్ట్రాల అభ్యర్థులకు ఐదు సంవత్సరాల సడలింపు ఉంటుంది. ఆన్‌లైన్ తరగతులు మే 18–జూన్ 15 వరకు జరుగుతాయి, భౌతిక తరగతులు మరియు ప్రాక్టికల్స్ జూన్ 23–సెప్టెంబర్ 30లో నిర్వహించబడతాయి. ఆసక్తి గల అభ్యర్థులు www.6wcc.nsnis.in� వెబ్‌సైట్ ద్వారా రూ.1,000 ఆన్‌లైన్ దరఖాస్తు రుసుము చెల్లించి రిజిస్టర్ కావాలి. కోర్సు పూర్తి రుసుము రూ.14,800 గా నిర్ణయించబడింది.

# ఇంధన ధరల భారంతో రైతులు ఇబ్బందులు కేంద్రాన్ని ప్రశ్నించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 4, ప్రతినిధి: పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మార్కెట్ ఆధారిత ధరల విధానంతో సాగు ఖర్చులు పెరిగి రైతుల ఆదాయాలు దెబ్బతింటున్నాయని, ఇంధనంపై ఆధారపడే పంటల రవాణా, ఎరువులు, యంత్రాల వినియోగం రైతులను ఆర్థికంగా కుంగదీస్తోందని ఆమె పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రత్యక్ష ఉపశమనం కల్పించే విధంగా ప్రత్యేక ధరలు లేదా సబ్సిడీలు ఇవ్వాలని డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి “ఇంధన ధరలు ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయిస్తాయని, అవసరమైతే కేంద్రం పన్ను తగ్గింపుల ద్వారా జోక్యం చేస్తుందని” తెలిపారు.

# విలీన గ్రామాల సర్వోత్తమ అభివృద్ధికి ఎంక్లేవ్ ఎమ్మెల్యే కృషి – గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 4, ప్రతినిధి బి. డేవిడ్: నూతన డివిజన్‌లో విలీన గ్రామాల మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్టు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.సుల్తాన్పూర్‌లో కోటి రూపాయలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం, వడకపల్లిలో 9.80 కోట్ల రూపాయలతో రాక్పార్క్, అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి, కృష్ణారెడ్డిపేట, ఐలాపూర్, సుల్తాన్పూర్, దయారా, పటేల్, ఐలాపూర్ తాండ, జనకంపేట గ్రామాల అభివృద్ధి పనులు ప్రధానంగా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.శుక్రవారం ఉదయం అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ ఈ సురేష్, మాజీ ఎంపీపీ దేవదానం, మాజీ జడ్పిటిసి సుధాకర్ రెడ్డి లతో కలిసి విలీన గ్రామాలను ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పెండింగ్ అభివృద్ధి పనులను సమీక్షించి, 8 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారని గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.కిష్టారెడ్డిపేట పేట పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభానికి పూర్తి చేయమని ఆయన అధికారులు కి ఆదేశించారు.

# వడకపల్లి పురాతన కోట అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సర్వే ప్రారంభం

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 4, ప్రతినిధి బి. డేవిడ్: పటాన్చెరువు మండలం వడకపల్లి గ్రామంలో గల పురాతన కోట చుట్టూ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు, అభివృద్ధి పనులకు హెచ్ఎండిఎ ద్వారా 9.80 కోట్ల రూపాయలు మంజూరు చేయబడ్డాయని తెలిపారు.కోట చుట్టూ రాక్పార్క్ నిర్మాణానికి పూర్తి స్థాయి సర్వే చేపట్టబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అత్యంత త్వరలోనే పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన జరగనుందని, గ్రామ ప్రజలకు అద్భుమైన వనరులు, పర్యాటక సౌకర్యాలు అందించేందుకు ఈ అభివృద్ధి కార్యక్రమం కీలకం అని వివరించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.